క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఆత్మకూరు: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చౌళ్లపల్లికు చెందిన కంచ రఘుపతి (38) అప్పుల బాధతో గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా రఘుపతి గురువారం రాత్రి మృతి చెందాడు. కాగా మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు వెల్లడించారు.

హుస్సేన్‌కు డాక్టరేట్



కమలాపూర్ : మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన ఎండీ హుస్సేన్‌కు డాక్టరేట్ వరించింది. ఈ మేరకు కేయూ పరీక్ష నియంత్రణాధికారి మల్లారెడ్డి శుక్రవారం వెల్లడించారు. 'ముస్లిం రైటింగ్ ఇన్ ఇంగ్లిష్, ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఇండియన్ ఇంగ్లిష్ నవలలు' అనే అంశంపై హుస్సేన్ సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ లభించినట్లు పేర్కొన్నారు. కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్ డాక్టర్ ఆర్. మేఘనరావు పర్యవేక్షణలో పరిశోధన జరిగినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన హుస్సేన్ తన ప్రాథమిక విద్యను గుండేడులో, తరువాత కన్నూర్‌లో పూర్తిచేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తన సోదరుడికి టైలరింగ్‌లో సహాయపడ్డారు. డిగ్రీ అనంతరం హైదరాబాద్ ఉస్మానియాలో యంఏ (ఇంగ్లిష్), బీఈడీ, ఎంఫిల్ పూర్తి చేశారు. 2014లో సెట్‌లో ఉత్తీర్ణత సాధించి, ప్రస్తుతం పీహెచ్‌డీలో రెండవ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం హైద్రాబాద్‌లోని జేబీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, ఇంగ్లిష్ విభాగ అధిపతిగా పనిచేస్తున్నారు. హుస్సేన్‌కు డాక్టరేట్ వరించడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రిన్సిపాల్, సహచరులు, కళాశాల యాజమాన్యం అభినందించింది.

దరఖాస్తుల స్వీకరణ

పరకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక నియామకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కామర్స్, డెయిరీ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, తెలుగు, ఇంగ్లిష్ విభాగాల్లో ఒక్కోటి చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు ఉన్నవారు అర్హులని తెలిపారు. సెట్, నెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కళాశాలలో అన్ని సర్టిఫికెట్‌ల జిరాక్స్‌లతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు 9951535357 సంప్రదించాలని వెల్లడించారు.

వర్షానికి కూలిన గోడ



ఐనవోలు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నందనం గ్రామంలో బండపల్లి సరోజ పెంకుటిళ్ల గోడ కూలింది. ఆ సమయంలో సరోజన ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే తహసీల్దార్ విచారణ చేపట్టి ఆర్థిక సాయం అందించాలని ఆమె కోరారు. ఒంటరి మహిళ కావడంతో ప్రభుత్వం నూతన గృహం మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు



నడికూడ: వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో గీతకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వరికోల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. వరికోల్‌కు చెందిన తాళ్లపల్లి రాములు రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు గ్రామ శివారులో గల తాటి చెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

సస్పెండ్ చేయడం సరికాదు

దామెర: పసరగొండ బీఆర్ఎస్ నాయకుడు, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణును బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం సరికాదని పసరగొండ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గ్రామంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు అనుకూలంగా స్థానిక ఎమ్మెల్యే ధర్మారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అస్సెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఉద్యమకారులకు టికెట్ ఇవ్వాలని డియండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు.

కార్మికులపై పట్టింపులేని ప్రభుత్వం

- 16 రోజులుగా కొనసాగుతున్న సమ్మె
- ప్రభుత్వం స్పందించాలని జీపీ కార్మికుల డిమాండ్



కమలాపూర్ : కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కమలాపూర్ : కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించడం హేయమైన చర్యని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 16వ రోజుకు చేరుకోగా ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మనెంట్ చేయాలని, వారికి కనీస వేతనం రూ.19 వేలు అందించాలని అన్నారు. ప్రమాద బీమా వర్తింపు, జీఓ 51 సవరణ, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో పంచాయతీ కార్మికుల తరుపున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు అయిలయ్య, రమేష్, రాజయ్య, స్వామి, నాయకులు భాస్కర్, అరుణ, ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 16వ రోజుకు చేరుకుంది. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో జీపీ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అలాగే ఎల్కతుర్తి మండల కేంద్రంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బోపగిని పోచయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు. జీపీ కార్మికుల వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వార వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్ రూ. 19వేలు వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. పంపు ఆపరేటర్లకు, ఎలక్ట్రీషన్లు, డ్రైవర్లు, బిల్ కలెక్టర్లకు సైతం రూ. 19 వేలు చెల్లించాలని, అలాగే కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీలం కుమార్, రాధ, స్వరూప, రుద్రయ్య, సారయ్య, గుడెల్లి లక్ష్మణ్, కుడితాడి రవీందర్, నిమ్మల వెంకటేశ్వర్లు, సునీల్, శ్రీనివాస్, రమేష్, కుమారస్వామి, మొగిళి, కోమల, స్వర్ణ, సులోచన, సారయ్య, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు



ధర్మసాగర్ : సమ్మె చేస్తున్న జీపీ సిబ్బంది

ధర్మసాగర్: గ్రామ పంచాయతీ సిబ్బంది బాధలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు చల్లా మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. జీపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే జీపీ సిబ్బందిపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాపర్తి శ్రీకాంత్, చింత కోమల, బుస్స యాదగిరి, కొలిపాక ఎల్లమ్మ, గంగారపు కరుణాకర్, గొల్లపల్లి రవి, సఫాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ధర్మసాగర్: వర్షాకాలం దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్థానిక వైద్యుడు గోపినాథ్ అన్నారు. మండలంలోని కేజీబీవీ, వేలేరు మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజన్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పరిశుభ్రమైన నీరు, వేడి పదార్థాలను మాత్రమే తీనాలని అన్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా, చెదారాన్ని తొలగించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించకుంటే వర్షాకాలం అయ్యినందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దోమలు, ఈగలతో విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది అజీమ్, వినోద, రజిత, ప్రశాంతి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, వేలేరు పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, కేఎస్వీ రాజగోపాల్, ఏఎన్ఎంలు రమాదేవి, కనకమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి



పవర్‌గ్రిడ్‌లో పనులను పరిశీలిస్తున్న డీఈ

దామెర: వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హనుమకొండ రూరల్ డీఈ సామ్యానాయక్ సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని పవర్‌గ్రిడ్‌లో 33 కేవీ లైన్ల మరమ్మతుతో పాటు స్తంభాలను సరిచేశారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వినియోగదారులకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కసూచించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దని సూచించారు. తడి బట్టలను కరెంట్ తీగలకు దగ్గరగా ఆరబెట్టవద్దని సూచించారు. విద్యుత్‌కు సంబంధించిన విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట పవర్‌గ్రిడ్ డీజీఎం సమ్మయ్య, డీఎం సత్తిబాబు, సంతోష్, సంపత్, ఏడీఈ దేవేందర్, ఏఈ గుర్రం రమేష్, సబ్ ఇంజనీర్ చందన, లైన్ ఇన్స్‌పెక్టర్లు రవీందర్, వేణుగోపాల్, లైన్‌మెన్ మనోహర్ తదితరులు ఉన్నారు.

నట్టల మందు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న వెంకటేష్

ఎల్కతుర్తి: పశువైద్యాధికారులు గొర్రెల నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని గొర్లకాపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని సూరారంలో గల పలువురు యాదవ కులస్తులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా అందించాల్సిన గొర్రెల మందులు ఇప్పటి వరకూ పంపిణీ చేయలేదని ఆరోపించారు. వర్షాకాలంలో గొర్రెలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గొర్రెలకు సకాలంలో నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడు పుట్ట కనుకయ్య, తనుగుల రాజయ్య, బీట్ల లింగయ్య, కొమురయ్య, బుచ్చయ్య, కిరణ్, శ్రీను, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంగిన వాగులు.. నిండుకుండల్లా చెరువులు

పరకాల: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పరకాల చలివాగు నీటి ఉధృతి పెరిగిపోయింది. వరదనీరు భారీగా చేరడంతో చెక్‌డ్యాం పూర్తిగా నీటమునిగిపోయింది. దింతో అప్రమత్తమైన చలివాగు ఒడ్డునున్న రైతులు వ్యవసాయ మోటార్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరో వైపు సాగుకు అనుకూలమైన వాతావరణం నెలకొనటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నడికూడ: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు వాగులు పొంగి పొర్లితున్నాయి. చెరవుల మత్తళ్లు దూకుతున్నాయి. కంఠాత్మకూర్ వాగు, నడికూడ మహ్మద్ షా నాల మాటు వాగులు పొంగడంతో పరకాల-అంబాల మధ్య రకాపోకలకు అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు వెళ్లలేని పరస్థితి నెలకొంది. దీంతో వాహనాలు రాకుండా గ్రామస్తులు రోడ్డుపై కర్రలు ఏర్పాటు చేశారు.

దామెర: మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు చెరువుల్లోకి వదర నీరు భారీగా చేరడంతో జలకళ సంతరించుకుంది. ఊరుగొండ పెద్దచెరువు, పసరగొండ చెరువులు మత్తడి పోస్తున్నాయి. ఈ ఏడాది పంటలకు సాగునీటి కోసం సరిపడా చెరువుల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దామెర : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మత్తడి పోస్తున్న ఊరుగొండ పెద్దచెరువు



నడికూడ : ప్రమాదాలు జరగకుండా రోడ్డుపై కర్రలు ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు



పరకాల : నీట మునిగిన పరకాల చలివాగు చెక్‌డ్యాం

స్నేహితుడి కుటుంబానికి చేయూత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన వనం సుభాష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా 1995-96 సంవత్సరంలో సుభాష్‌తో కలిసి పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబ సభ్యులకు చేయూతనిచ్చారు. శుక్రవారం సుభాష్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 11 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దామెరకొండ కొమురయ్య, చింతల రవిపాల్, ఎండీ రాజ్‌మహ్మద్, రాజశేఖర్, మధుకర్ రెడ్డి, రామకృష్ణ, జహంగీర్, రమేష్, ప్రభాకర్, రాజు, రమేష్, కిరణ్, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

హన్మకొండ చౌరస్తా: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధిత మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. హనుమకొండ మచిలీబజార్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మహిళలు హక్కులు, న్యాయసేవా అంశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత మహిళలు, బాలికలు సమస్యలపై ఫిర్యాదు, ఇతర న్యాయ సలహాల కోసం 0870 – 2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయవచ్చని చెప్పారు. 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ఆపదలో ఉన్న మహిళలు సంప్రదించాలన్నారు. సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి



ఈజీఎస్ సిబ్బందిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌కుమార్

కమలాపూర్ : పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో శుక్రవారం నర్సరీ, పండ్ల తోటల పెంపకం, హరితహారం, ఉపాధి హామీ పథకంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి పండ్ల తోటల పెంపకానికి 200 ఎకరాలు టార్గెట్ ఇచ్చామన్నారు. జామ, నిమ్మ, బత్తాయి, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్ మొదలైన పండ్ల తోటలను పెంచాలని అన్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ ఐదు ఎకరాల లోపు రైతులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతీ గ్రామంలో ఇంటింటికీ ఇంకుడు గుంతలు, డ్రైనేజీ వర్టికల్ సోక్ పిట్స్ నిర్మించాలని ఆదేశించారు. అనంతరం మండలంలో ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పనిదినాలు, పని కల్పించిన పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లను శాలువాతో సత్కరించి మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, ఎంపీడీఓ పల్లవి, ఎంపీఓ విమల, ఏపీఓ రమేష్, ఈసీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తిరుపతి

పరకాల: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఆగష్టు రెండోవారంలో హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బొచ్చు తిరుపతి మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని అమరధామం పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టలేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ హేమంత్ మాదిగ, మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, శివ తేజ, బబ్లూ, మంద అజయ్ పాల్గొన్నారు.

ఐనవోలు: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టని అధికార పార్టీకి, వర్గీకరణపై నోరు మెదుపని ప్రతిపక్షాలకు రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కో ఇన్‌చార్జ్ జన్ను దినేష్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌లు అంబాల చంద్రమౌళి అన్నారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా ఆగస్టు రెండో వారంలో హైదరబాద్‌లో చేపట్టనున్న మాదిగల విశ్వరూపం మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎస్సీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం కట్కూరి ప్రవీణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 9 ఏండ్లు గడుస్తున్న వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగలను మోసగించిందన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సుకుమార్, ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు బొక్కల నారాయణ, బరిగెల వెంకటస్వామి, శనిగరపు రవీందర్, నాయకులు చింత గట్టయ్య, చింత శ్రీను, బరిగెల దిలీప్, కట్కూరి బాబ్జి ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుండగులను ఉరి తీయాలి



రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎల్కతుర్తి: మణిపూర్‌లో గిరిజన మహిళలపై కర్కశంగా వ్యవహరించిన దుండగులను ఉరి తీయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఉదంతం యావత్ భారతదేశం తలదించుకునేలా చేసిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హన్మకొండ-సిద్ధిపేట ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో సభ్య సమాజం తలదించుకునే సంఘటన జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. దేశంలో స్త్రీలకు, బడుగు, బలహీన వర్గాల వారికి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కల్పించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహిస్తూ పీఎం నరేంద్రమోదీ, అక్కడి సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు తిరుపతి, షర్ఫోద్దీన్, ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, తాళ్ళపల్లి మధుకర్, అంబాల బాబు, మంగ రామచంద్రం, కాంతారావు, పోచయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సోక్‌పిట్స్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాసకుమార్

ఆత్మకూరు: గ్రామ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసకుమార్ కోరారు. మండల కేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ సోక్‌పిట్స్, వాల్ పెయింటింగ్స్, మేజిక్ సోక్ పిట్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రతీ ఒక్కరు తమవంతుగా కృషి చేయాలని అన్నారు. గ్రామంలో చేపట్టిన సోక్‌పిట్స్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, రాము, కార్యదర్శి యాదగిరి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

ఆత్మకూరు: ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఎల్ఓలకు ఓటరు ప్రక్రియపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఎల్ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అప్‌డేట్ చేయాలన్నారు. 2023 అక్టోబర్1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. అలాగే తప్పుల సవరణ, మరణించిన వారి ఓట్ల తొలగింపు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవీందర్‌రావు, భూలక్ష్మి, భారతి, దామోదర్, బీఎల్ఓల సంఘం మండల అధ్యక్షుడు వంగేటి సత్యం, బీఎల్ఓలు సుమలత, శ్రీకాంత్, రవి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నేడు (శనివారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తూర్పాటి సునీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. వివిధ శాఖల అధికారులు మండలానికి సంబంధించిన పూర్తి నివేదికతో సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను మండల సభలో చర్చించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. కల్యాన్ (S.R) : 8686236437 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)